

గండికోటలోని మాధవరాయస్వామి ఆలయం గాలిగోపురం



గండికోటలో జరిగిన భారతీయుడు-2 షూటింగ్‌లో పాల్గొన్న కమల్‌హాసన్



స్టార్ట్.. యాక్షన్.. కెమెరా..!

- జిల్లాలో సినిమా షూటింగ్‌ల సందడి
- తమిళ, తెలుగు హీరోల షూటింగ్‌లు

పెన్నానది పరవళ్లు.. గండికోట చారిత్రక అద్భుత కట్టడాలు.. సహజసిద్ధంగా ఏర్పడిన పెన్నాలోయ.. నగటు మనుషులకే కాదు.. సినిమా వారికీ తెగనచ్చేశాయి. అందుకే ఎక్కడో హైదరాబాదు చెన్నై నగరాల్లో వినిపించే 'స్టార్ట్.. యాక్షన్.. కెమెరా..!' అనే డైలాగులు ఇప్పుడు ఇక్కడా వినిపిస్తున్నాయి. చిన్నా చితకా సినిమాలే కాదు.. అగ్రహీరోలైన కమల్‌హాసన్, విక్రమ్, రజనీకాంత్, విజయ్, బాలకృష్ణ తదితరుల సినిమాలు ఇక్కడ షూటింగ్ జరుపుకున్నాయి. పర్యాటకంగానే కాదు.. సినిమాల పరంగానూ జిల్లాలకు ఇప్పుడు ప్రత్యేక గుర్తింపు వస్తోంది.

- వివరాలు 6లో..



ఎర్రగుంట్ల వద్ద నాపరాయి గనుల్లో రజనీకాంత్ సినిమా షూటింగ్

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఈ

కడప (నాగరాజుపేట), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాల వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి రమణ అన్నారు. విద్యుత్ సమస్యలపై జిల్లా అంతటా ఏడు కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు గాలులు వీచేటప్పుడు ఎవ్వరూ కరెంటు స్తంభాలను తాకరాదన్నారు. ఇంట్లో తడిచిన స్విచ్‌బోర్డులను చేతులతో తాకకుండా కట్టె పుల్ల ద్వారా లేదా ప్లాస్టిక్ వస్తువుల ద్వారా స్విచ్‌లు ఆన్ చేసుకోవాలన్నారు. రైతులు వారి విద్యుత్ మోటర్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడైనా కరెంటు లైన్లు తెగిపడినా, స్తంభాలు విరిగి పడినా సంబంధిత శాఖ అధికారులకు తెలపాలన్నారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నెం.1912కు కాల్ చేసి పరిష్కరించుకోవాలన్నారు. ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని ఐదు విద్యుత్ డివిజన్లలో ఐదు కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని తెలిపారు. కడప జిల్లా కంట్రోల్ రూము ఫోన్ నెంబర్ 9440817440, కడప డివిజన్ 9440817441, పులివెందుల డివిజన్ 9491431255, ప్రొద్దుటూరు డివిజన్ 7893261958, మైదుకూరు డివిజన్ 949287332లకు కాల్ చేసి ప్రజలు తమ సమస్యలు విన్నవించుకోవాలన్నారు.

76మంది పోలీసు సిబ్బంది బదిలీ

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ 76 మందిని బదిలీచేస్తూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 14మంది ఏఎస్ఐలు, 19మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 43 మంది కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. బదిలీ అయిన సిబ్బంది తక్షణమే వారికి కేటాయించిన పోలీసుస్టేషన్‌లో రిపోర్టు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

వైవీయూ రిజిస్ట్రారు రాజీనామా ఆమోదం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వైవీయూ తెలుగుశాఖ ప్రొఫెసరు తప్పెట రాంప్రసాద్‌రెడ్డి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. వ్యక్తిగత కారణాల దృష్ట్యా విధుల నుంచి రిలీవ్ చేయాలని కొద్దిరోజుల కిందట ఆయన వీసీని కోరారు. ఆయన విజ్ఞాపన మేరకు ఇన్‌చార్జి రిజిస్ట్రారు విధుల నుంచి రిలీవ్ చేసినట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి సోమవారం వెల్లడించారు.

ప్రారంభమైన పల్లెపండుగ



పులివెందుల మండలం ఎర్రిపల్లె గ్రామంలో సీసీరోడ్డు పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలుచోట్ల స్థానిక ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ఆ రోడ్లపై వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పలు మండలాల్లో రోడ్ల నిర్మాణ పనులనుప్రారంభించారు. చెన్నూరు మండలం రామనపల్లెలో ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పనులు ప్రారంభించారు. వల్లూరులో ఎమ్మెల్యే పనులు ప్రారంభించగా డీటీవో రాజ్యలక్ష్మి డ్వామా ఏపీడీ నాగరత్నమ్మ పాల్గొన్నారు. అలాగే పులివెందుల మండలం ఎర్రపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్‌రవి పనులు ప్రారంభించారు. వేముల మండలంలో టీడీపీ నాయకులు పార్థసారధి రెడ్డి పనులు ప్రారంభించారు. అలాగే ప్రొద్దుటూరు చౌటపల్లె గ్రామంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి రూ.65లక్షల నిధులతో రోడ్ల పనులు ప్రారంభించారు.

శభాష్ నాగవేణి



- అన్నీ తానై కుటుంబాన్ని నడిపిస్తున్న వైనం
- చూపు లేని భర్తను ఆటోలో ఎక్కించుకుని..
- ఆటో నడుపుతూ పల్లెల్లో కూరగాయలు అమ్ముతూ కుటుంబ పోషణ

- వివరాలు 6లో..

లాటరీ మీకు.. దుకాణం మాకు..!





- మద్యం షాపుల కోసం రాజకీయ పైరవీలు
- షాపుల్లో వాటా కోసం వత్తిడి
- లైసెన్సుదారులకు ఫోన్ల ద్వారా హెచ్చరికలు
- లాటరీ ద్వారా 139 షాపులు కేటాయింపు
- భారీగా వచ్చిన దరఖాస్తులు
- లాటరీ తగిలినవారికి ఆనందం..
- షాపు దక్కని వారికి నిర్వేదం
- మద్యం వ్యాపారంలోకి పలువురు మహిళలు

జగన్ పాలనలో ప్రభుత్వమే దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం అమ్మింది. అయితే కూటమి ప్రభుత్వం మళ్లీ పాత విధానం తీసుకువస్తుండడంతో షాపుల కోసం పాత మద్యం వ్యాపారులు, కొత్తవారు భారీ సంఖ్యలో దరఖాస్తు చేశారు. సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా 139 దుకాణాలను కేటాయించారు. అయితే జిల్లాలో మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాలు తప్ప.. మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో మద్యం దుకాణాలకోసం రాజకీయ పైరవీలు మొదలయ్యాయి. కొన్నిచోట్ల అధికార పార్టీ నేతలు నేరుగా ఫోన్ చేసి దుకాణాలు తమకే కావాలని హెచ్చరిస్తుండగా.. మరికొందరు ఒక్కో దుకాణానికి నెలకు రూ.లక్ష ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని అంటున్నారు. దుకాణాలు ప్రారంభం కాకముందే బెదిరింపులు మొదలవడంతో లాటరీలో మద్యంషాపులు దక్కిన వారు తలలు పట్టుకుంటున్నారు.



లాటరీ ద్వారా దుకాణాలను ప్రకటిస్తున్న కలెక్టర్ శివశంకర్, జేసీ అదితిసింగ్

(కడప-ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యంపాలసీ విధానం బుధవారం నుంచి అమల్లోకి రానుంది. జిల్లాలో 139 మద్యంషాపులకు రెండేళ్ల కాలపరిమితికి గాను ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. తొలి కొద్దిరోజులు దరఖాస్తులు తక్కువ వచ్చాయి. సిండికేట్ వ్యవహారంపై ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది సీఎం చంద్రబాబు నేతలకు క్లాస్ పీకారు. దీంతో జిల్లావ్యాంగా మొత్తం 3,257 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం జిల్లా పరిషత్ సభాభవనంలో కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ డ్రా నిర్వహించారు. ఉదయం 7.30గంటలకు ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. జిల్లాలో దరఖాస్తుదారులంతా తెల్లారేసరికి అనుచరులతో కడపకు చేరుకున్నారు. జిల్లాపరిషత్ ప్రాంతమంతా మద్యం వ్యాపారులతో సందడిగా మారింది. ఓ పక్క వర్షం కురుస్తున్నప్పటికీ దరఖాస్తుదారులు భారీ ఎత్తున తరలివచ్చారు. డ్రా ద్వారా 139మందిని అధికారులు ఎంపిక చేశారు. లిక్కరు వ్యాపారాలుగా పేరొందినవారికి ఈ సారి లక్కీ తగలలేదు. చాలా మంది కొత్తవారికి లక్కీ డ్రా తగిలింది.

మేము సైతం

మద్యం వ్యాపారంలోకి ఈసారి మహిళలు ఎంట్రీ ఇచ్చారు. వారి పేరిట దరఖాస్తులు వచ్చాయి. డ్రాలో పలువురు మహిళలకు షాపులు దక్కాయి. మైదుకూరులోని షాపు నెంబర్ 111, జమ్మలమడుగులో 65వ నెంబరు షాపు సృజన అనే మహిళకు లాటరీ ద్వారా తగిలాయి. అలాగే సిద్దవటంలో ఒక షాపు అక్కిశెట్టి కవిత, జమ్మలమడుగులో 58వ నెంబరుషాపు సుశీల, ప్రొద్దుటూరు 68వ షాపు కళ్యాణి, పులివెందుల 96వ షాపు గంగాదేవి, 97వ షాపు సరస్వతీలకు లాటరీ ద్వారా దక్కాయి. మొత్తం 7 మద్యం దుకాణాలు మహిళలకు రాగా వీటిలో 2 షాపులు సృజనకే వచ్చాయి.

దరఖాస్తులే దరఖాస్తులు

కొన్ని మద్యం షాపులకు భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. మైదుకూరులోని 124వ షాపునకు 53 దరఖాస్తులు వచ్చాయి. తరువాత ప్రొద్దుటూరులో పరిధిలో 81వ దుకాణానికి 49 దరఖాస్తులు వచ్చాయి. అత్యంత స్వల్పంగా కడప ఎక్సైజ్ పరిధిలో 27, 28 దుకాణాలకు ఒక్కోదానికి ఐదు దరఖాస్తులు వచ్చాయి. కడపలోని 10వ దుకాణానికి 31 దరఖాస్తులు వస్తే హరికుమార్ ఒక్కడే 19 దరఖాస్తులు వేశారు.

మద్యంషాపుల కోసం రాజకీయ పైరవీలు

లాటరీ ద్వారా మద్యం షాపులు దక్కని కొందరు నేతలు పైరవీలు మొదలుపెట్టారు. సోమవారం రాత్రి వరకు అందిన సమాచారం మేరకు జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు, కడపలో పొలిటికల్ పైరవీలు మొదలైనట్లు చెబుతున్నారు. షాపులు దక్కని నాయకులు లాటరీ తగిలిన వారికి నేరుగా ఫోన్లు చేసి షాపు ఇవ్వండి, మీకు గుడ్‌విల్‌ఇస్తాం, లేదా మాకు వాటా ఇవ్వండని బెదిరింపులకు దిగారని చెబుతున్నారు. జమ్మలమడుగులో 30శాతం వాటా డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. కమలాపురం ఏరియాలో షాపుల కోసం పొలిటికల్ వత్తిడి మొదలైనట్లు చెబుతున్నారు. మీడియా వారికి కూడా ఈ సారి షాపులు వచ్చాయి. మీడియాలో పనిచేసేవారు దరఖాస్తులు వేయగా 4 షాపులు దక్కాయి. అవి తమకే కావాలని అడుగుతున్నట్లు సమాచారం. ఇక ప్రొద్దుటూరులో ఓ ఇద్దరు నేతలు షాపులు ఇవ్వాలని లాటరీ తగిన వారికి ఫోన్లు చేస్తున్నారని చెబుతున్నారు. ఇదే ఊరిలో మరో టీడీపీ ముఖ్యనేత ఫోన్ చేసిన ఒక్కో షాపువారు నెలకు రూ.లక్ష ఇవ్వాలని హుకుం జారీ చేశారని అంటున్నారు. బుధవారం నుంచి ప్రైవేటు మద్యంషాపులు ప్రారంభం కానున్నాయి. ఇంతలోనే షాపుల్లో వాటాలో, లేదా గుడ్‌విల్ తీసుకునే ప్రయత్నం సాగుతోంది.

అయ్యయ్యో..

లిక్కరు షాపుల్లో లక్కీ కోసం కొందరు నేతలు, వ్యాపారులు భారీ స్థాయిలో దరఖాస్తు చేశారు. కడపలో ఓ నేత అనుచరవర్గం సుమారు వంద షాపుల దాకా దరఖాస్తు చేశారు. అయితే వారి అనుచరులకు ఆరు మాత్రమే తగిలాయంటారు. అలాగే వీరిలో ఓ లిక్కరు వ్యాపారే 40 దరఖాస్తులు ఇచ్చారని అంటున్నారు. పులివెందులకు చెందిన ఓ వ్యాపారి 40 వేయగా ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి అనుచరులతో కలిసి సుమారు వంద దరఖాస్తులు వేసినట్లు సమాచారం. ప్రొద్దుటూరులో ఓ నాయకుడు 32 షాపులకు వేస్తే ఒక్కటి కూడా రాలేదంటారు. బినామీ పేర్లతో భారీ ఎత్తున దరఖాస్తులు వేశారు.

అంతా ప్రశాంతం

మద్యంషాపులకు లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 9 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో నుంచి 139 షాపులకు గాను 3,257 దరఖాస్తులు వచ్చాయి. రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టరు డ్రా తీశారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు లాటరీ విధానం పరిశీలించారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ రవికుమార్, అసిస్టెంటు ఆఫీసరు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




లక్కీడ్రాకు హాజరైన దరఖాస్తుదారులు



నీటితో కళకళలాడుతున్న పైడిపాలెం ప్రాజెక్టు

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు కృష్ణాజలాలతో కళకళలాడుతున్నాయి. జగన్ సీఎంగా ఉంటే వర్షాలే వర్షాలు అంటూ గత ప్రభుత్వ హయాంలో వైసీపీ శ్రేణులు పెద్దగా ప్రచారం చేసుకునేవారు. ప్రాజెక్టులు నిండా నీళ్లు నిలవ ఉన్నాయంటూ గొప్పలు చెప్పుకునేవారు. అయితే జగన్ చివరి ఏడాది పాలన అయిన 2023లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రాజెక్టులన్నీ ఒట్టిపోయాయి. ఇక పెన్నా, కుందూ పాపాఘ్ని అయితే ఖాళీగా కనిపించాయి. అయితే ఈ ఏడు ఆ పరిస్థితి లేదు. గత ఏడాది నీళ్లు లేక ఒట్టిపోయిన ప్రాజెక్టుల్లో ఇప్పుడు జలకళ ఉట్టిపడుతోంది. కీలకమైన ప్రాజెక్టుల్లోకి నీరు రావడంతో రైతులు వ్యవసాయ పొలాల్లో బిజీ అయ్యారు.



గండికోట ప్రాజెక్టు

జలకళ

- ప్రాజెక్టులకు సమృద్ధిగా చేరుతున్న నీరు
- ప్రాజెక్టుల్లో 59.22 టీఎంసీల నీరు నిల్వ
- జిల్లా వ్యాప్తంగా సాగులో రైతులు బిజీ



ఖాజీపేటలోని కేసీకెనాల్ పరిధిలో సాగులో ఉన్న వరి

(కడప-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు ప్రధాన సాగునీటి వనరులు తెలుగుగంగ ప్రాజెక్టు, బ్రహ్మంసాగర్ రిజర్వాయరు, కేసీ కెనాల్, గండికోట రిజర్వాయర్, అన్నమయ్య ప్రాజెక్టుతో పాటు పాటు మరికొన్ని ఉన్నాయి. ప్రధానంగా తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు కింద 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇక కేసీ కెనాల్ ద్వారా 90 వేల ఎకరాలకు నీరు వస్తుంది. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటి ఆధారంగా దాదాపు 4లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఉమ్మడి జిల్లాలో 82.255 టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో పింఛా, అన్నమయ్య ప్రాజెక్టులు కొట్టుకుపోయి మూడేళ్లు అవుతోంది. మిగిలిన వాటిలో ప్రస్తుతం 59.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలం నుంచి నీళ్లు వస్తే ఈ సామర్థ్యం మరింత పెరగనుంది. ప్రధానమైన గండికోట రిజర్వాయర్ సామర్థ్యం 26.850 టీఎంసీలు కాగా ప్రస్తుతం ఇందులో 26.270 టీఎంసీలు ఉన్నాయి. ఇక మైలవరం డ్యాంలో 5.865 టీఎంసీలు, పైడిపాలెం బ్యాలెన్సింగ్‌లో 5.332 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

బ్రహ్మంసాగర్

తెలుగుగంగ పరిధిలోని బ్రహ్మంసాగర్ రిజర్వాయరు జిల్లా వ్యవసాయానికి ఆయువుపట్టు లాంటిది. ఇక్కడ దాదాపు 1.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీని పరిధిలో కుడి ఎడమ కాల్వతో పాటు ఎల్ఎస్‌పీ డ్యాం, రెండు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి ద్వారా నేరుగా ఆయకట్టుకు నీరందడమే కాకుండా భూగర్భజలాల పెంపు ద్వారా అదనపు ఆయకట్టు సాగులోకి రానుంది. ఇప్పటికే బ్రహ్మంసాగర్‌కు క్రిష్ణా జలాలు విడుదల చేశారు. ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతోంది. దీంతో ఇక్కడ వరిసాగు ఊపందుకుంది.

కేసీ కెనాల్

జిల్లాకు మరో ముఖ్యమైన నీటి వనరు కేసీ కెనాల్. దీనినే కడప కర్నూలు కాలువ అంటారు. దువ్వూరు, మైదుకూరు, ఖాజీపేట, చెన్నూరు, ప్రొద్దుటూరు, రాజుపాలెం, సీకేదిన్నె మరి కొన్ని మండలాల్లో ఈ కెనాల్ పరిధిలో ఆయకట్టు ఉంది. సుమారు 90వేల ఎకరాలకు కేసీ కెనాల్ ద్వారా నీరందుతుంది. ఈ కాలువలో నీళ్లు వచ్చాయంటే.. కడప-కర్నూలు జాతీయ రహదారి ఎటు చూసినా పచ్చగా పంటలతో కళకళలాడుతూ ఉంటుంది. మైలవరం జలాశయం పరిధిలోనూ సుమారు 10వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ఈ ప్రజెక్టు కూడా నీటితో కళకళలాడుతోంది. పైడిపాలెం, వామికొండ రిజర్వాయర్లలో నీరు ఉంది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు దెబ్బతిన్నా.. సాగునీటి రిజర్వాయర్ల కింద రైతులకు ఊరట లభించే అవకాశం ఉంది.

ప్రాజెక్టుల వారీగా నీటి సామర్థ్యం టీఎంసీలలో..

ప్రాజెక్టు	సామర్థ్యం	ప్రస్తుతం
గండికోట రిజర్వాయరు	26.850	26.270
మైలవరం	6.500	5.865
పైడిపాలెం బ్యాలెన్సింగ్	6.000	5.332
సర్వారాయసాగర్	3.060	1.005
వామికొండ రిజర్వాయరు	1.658	1.434
తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఆర్1	2.130	1.660
ఎస్ఆర్-2	2.447	1.881
బ్రహ్మంసాగర్	17.735	6.651
వెలిగల్లు	4.64	2.332
బుగ్గవంక	0.506	0.048
ఎల్ఎస్‌పీ	0.169	0.001



కేసీ కెనాల్‌లో నీరు

స్టార్ట్.. యాక్షన్.. కెమెరా..!


- జిల్లాలో సినిమా షూటింగ్‌ల సందడి
- తమిళ అగ్రహీరోల షూటింగ్‌లు ఇక్కడే
- అద్భుతమైన లొకేషన్స్



గండికోటలో కమల్‌హాసన్ భారతీయుడు-2 సినిమా షూటింగ్ సీన్స్


(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడప కళలకు కవులకు పుట్టినిల్లు. అంతేకాదు.. జిల్లాలో ఎంతో చారిత్రాత్మక ముఖ్యప్రదేశాలు ఉన్నాయి. ఒకప్పుడు కడప అంటే ఫ్యాక్షన్ హత్యలు, బాంబులు మోతే వినిపించేది. అలాంటి చోట నేడు సినిమా షూటింగ్‌ల సందడి నెలకొంది. తెలుగుహీరోల కన్నా తమిళ అగ్రహీరోలే మన కడప గడపలో సినిమా షూటింగ్‌లు చేస్తుండడం గమనార్హం. స్టార్ట్, యాక్షన్, కెమెరా అన్న పదాలు మొన్నటి వరకు హైదరాబాదు, చెన్నై, వైజాగ్, కోనసీమ జిల్లాల్లో వినిపించేవి. ఇప్పుడు మన జిల్లాలో కూడా సినిమా షూటింగ్‌లు జరుగుతుండడం విశేషం. ఇటీవల జరిగిన అగ్ర హీరోల సినిమా షూటింగ్‌లను పరిశీలిస్తే..

గండికోట



గండికోట మన జిల్లాకు పెద్ద చారిత్రక సంపద. ఇప్పుడిది టూరిజం ఫేజ్‌గా మారింది. ఇక్కడ అగ్రహీరోల సినిమాలతో పాటు చిన్నచిన్న సినిమాలు, టీవీ సీరియల్స్ య్యూట్యూబ్ స్టోరీల షూటింగ్‌లకు కేరాఫ్‌గా ఉండడం గమనార్హం.

గండికోటలో ప్రముఖ తమిళ అగ్రకథానాయకుడు పాన్ ఇండియా హీరో కమల్ హాసన్ నటించి ఇటీవల విడుదలైన భారతీయుడు-2 షూటింగ్ జరిగింది. సినిమాలో కీలకమైన సన్నివేశాలు ఇక్కడే చిత్రీకరించారు. కమల్‌హాసన్ తిరుపతిలో బస చేస్తూ షూటింగ్ కోసం ప్రతిరోజూ హెలిక్యాప్టరులో వచ్చి ఇక్కడ షూటింగ్‌లో పాల్గొనేవారు. ఇక విలక్షణ నటుడు తమిళహీరో విక్రమ్ నటించిన స్వామి-2 కూడా ఇక్కడే షూటింగ్ జరుపుకుంది. సినిమాలో కీలక ఫైట్ సీన్స్ ఇక్కడే చిత్రీకరించారు. అలాగే లారెన్స్ నటించిన సూపర్ కౌబాయ్ షూటింగ్ ఇక్కడే జరుపుకుంది.



తెలుగు సినిమాలు కూడా పదేళ్ల క్రితం రాజమౌళి సునీల్‌ను హీరోగా పెట్టి మర్యాదరామన్న సినిమా తీశారు. ఇందులో కీలకమైన సన్నివేశాలు గండికోట, హనుమనగుత్తి ప్రాంతంలో చిత్రీకరించారు. క్లైమాక్స్ సీన్‌ను ఇక్కడే తీశారు. అలాగే గోపిచంద్ నటించిన సాహసం సినిమాకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలను ఇక్కడే తీశారు. హీరోయిన్ తాప్సీ షూటింగ్‌లో పాల్గొంది. బాలక్రిష్ణ సినిమా వీరసింహారెడ్డి సినిమాలో విలన్ తండ్రి పాత్ర చనిపోతుంది. అంత్యక్రియల సీన్ ఇక్కడే చిత్రీకరించారు. ఇక మంగళవారం సినిమా ఇక్కడే షూటింగ్ చేసుకుంది. మరికొన్ని కన్నడ, తమిళ సినిమాలు ఇక్కడే షూటింగ్ జరుపుకున్నాయి. గండికోట ఇప్పుడు తమిళ, కన్నడ సినిమాలకు హాట్ స్పాట్‌గా మారిపోయింది.

ఎర్రగుంట్లలో

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించి ఇటీవల విడుదలైన 'వెట్టయం' సినిమా షూటింగ్ కూడా ఇటీవలే ఎర్రగుంట్లలోని నాపరాయి గనుల్లో జరుపుకుంది. రజనీకాంత్‌పై కీలకమైన సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు.

తెలుగుగంగ కార్యాలయంలో..



కత్తి సినిమా షూటింగ్ జరుపుకున్న మామిళ్లపల్లె తెలుగుగంగ కార్యాలయం

కడప నగర శివారులోని తెలుగుగంగ కార్యాలయంలో తమిళ హీరో విజయ్ నటించిన కత్తి సినిమా షూటింగ్ చేసుకుంది. ఆ సినిమాలో కలెక్టరేట్‌ను ముట్టడించే సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు. ఈ సినిమా కోసం దాదాపు వారం పాటు విజయ్ ఇక్కడే ఉన్నారు. ప్రధాన షెడ్యూలులో హీరో విజయ్‌తో పాటు పలు ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఇక కడపలో కారందోశ మరికొన్ని సినిమాలు షూటింగ్ జరుపుకున్నాయి. ఎన్టీఆర్ సీఎం కాక ముందే బ్రహ్మంగారి జీవిత చరిత్ర బ్రహ్మంగారి మఠం, పుష్పగిరిలో.. ఇక కాశినాయన ఆశ్రమంలో కాశినాయన జీవితచరిత్ర సినిమా మరికొన్ని సినిమాలు షూటింగ్ ఇక్కడే జరిగాయి. మొత్తానికి ఇప్పుడు కడప జిల్లా సినిమా షూటింగ్‌లతో సందడిగా మారిపోయింది. ప్రస్తుతం సినిమా షూటింగ్‌లకు కడప కేరాఫ్‌గా మారింది.



ఎర్రగుంట్లలో షూటింగ్‌లో పాల్గొన్న రజనీకాంత్

ఆరోగ్య ఖరము...

- కడవ అక్కర్లేదు.. చెంచాడు చాలు..
- 10 మిల్లీలీటర్లు రూ.100
- గాడిద పాలకు భలే గిరాకీ..

గంగిగోవు పాలు.. గరిటెడైనను చాలు.. కడివెడైన నేమి.. ఖరము పాలు.. భక్తి కలిగిన కూడు పట్టెడైన చాలు.. విశ్వధాభిరామ వినురవేమ!

మంచి ఆవు పాలు.. గరిటెడైనా చాలు.. గాడిద పాలు కడివెడున్నా ఉపయోగం లేదు.. అన్నది ఈ పద్యం తాత్పర్యం.



గాడిదతో ఊరూరా తిరుగుతున్న మహిళ..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఇప్పుడున్న పరిస్థితి చూసి ఉంటే.. వేమన ఈ పద్యాన్ని పూర్తిగా మార్చి రాసి ఉండేవారేమో.? ఆవు పాలు లీటరు రూ.80 నుంచి రూ.100 వరకు ధర పలుకుతుంటే గాడిద పాలు లీటరు రూ.10 వేల వరకు ఉంటోంది. మారిన కాలానికి.. ఆవు పాలు కంటే గాడిద పాలకే గిరాకీ ఎక్కువగా ఉంది. దీనిని బట్టి గాడిద పాలు కడవ అక్కర్లేదు.. చెంచాడు చాలు అనొచ్చేమో.? కొన్ని రోజులుగా రాయచోటి పట్టణంలో కొందరు మహిళలు గాడిదలను వీధుల్లో తిప్పుతూ వాటి పాలను అమ్ముతున్నారు. చంకలో ఓ చిన్న మైకు పెట్టుకుని గాడిద పాలమ్మో.. గాడిద పాలు.. అంటూ ఊరూరా తిరుగుతూ.. పది మిల్లీలీటర్ల పాలు వంద రూపాయలకు అమ్ముతున్నారు.

గాడిద పాలు అమ్ముతూ వెళ్తున్న పీరమ్మ అనే మహిళతో ఆంధ్రజ్యోతి మాట్లాడగా.. తమది తెలంగాణా రాష్ట్రం ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల అనీ.. అక్కడ రోళ్లు కొట్టుకుని జీవిస్తామని తెలిపింది. పొలం.. పుట్రా లేకపోవడంతో కూలి పనులే తమకు దిక్కని .. దీంతో తమ పిల్లలు కూడా పెద్ద చదువులు చదవలేదని వివరించింది. మిగతా వివరాలు ఆమె మాటల్లోనే..

సంవత్సరంలో ఆరు నెలల పాటు (వర్షాకాలంలో) తెలంగాణా, ఆంధ్రలో ఊరూరా తిరిగి గాడిద పాలను అమ్ముకుంటాం. మంచిర్యాల పట్టణంలో దాదాపు అందరూ ఈ వృత్తినే ఎంచుకున్నారు. గాడిద పాలు సుమారు పది మిల్లీలీటర్లు రూ.100కు అమ్ముతాం. ప్రస్తుతం రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులో ఓ చోట గుడారాలు వేసుకుని గాడిదలను అక్కడ ఉంటున్నాం. నా భర్త కూడా నాతో పాటే గాడిదను తీసుకొచ్చాడు. వారం పది రోజుల పాటు ఒక్కో ఊర్లో ఉంటూ గాడిద పాలను అమ్ముకుంటాం. మళ్లీ వేరే ఊరికి వెళ్తాం. ఈ పాలను దగ్గు, జీర్ణసంబంధ వ్యాధులు.. ఉబ్బరం, మలబద్ధకం వ్యాధులు నయమవుతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అమ్మపాలతో సమానంగా ఇందులో పోషకాలు ఉంటాయంట. ఎక్కువగా శిశువులకు గాడిదపాలను తాగిస్తారు. ఎటువంటి రోగాలు లేని వాళ్లు కూడా తాగవచ్చు. ప్రస్తుతం చాలామంది గాడిద పాలు కొంటున్నారు. ఒక్కో గాడిద నెల రోజుల వరకు మాత్రమే ఈ పాలను ఇస్తుంది.

గాడిదలకు భలే గిరాకీ

గతంలో గాడిదలు ఎక్కువగా రజకవృత్తి చేసుకునే వాళ్ల దగ్గరే ఉండేవి. అయితే, కొంత కాలంగా గాడిద మాంసానికి విపరీతమైన గిరాకీ ఏర్పడడంతో వాటి సంఖ్య తగ్గిపోతోంది. విజయవాడ వంటి ప్రాంతాలలో గాడిద మాంసం కిలో రూ.800 వరకు ఉంటోంది. ఈ మాంసం తినడం ఆరోగ్యానికి మంచిది అనే నమ్మకంతో గాడిద మాంసానికి రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా గాడిదల సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. దీంతో ఒక్కో గాడిదను రూ.30 వేలు పెట్టి కొనాల్సి వస్తోందని పీరమ్మ తెలిపింది.

అద్భుత ఇంజనీర్లు...

- రాజంపేటలో హల్‌చల్ చేస్తున్న గిజిగాళ్లు
- చక్కటి నైపుణ్యంతో చూపరులను ఆకట్టుకునేలా గూళ్లు ఏర్పాటు



రాజంపేట పట్టణానికి సమీపంలోని తాళ్లపాక ప్రాంతంలో ఉన్న గిజిగాడి గూళ్లు

రాజంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో గిజిగాడి సంతతి బాగా పెరిగిపోయింది. మానవ ఇంజనీర్లకే అసాధ్యమైన ఇంజనీరింగ్ పనిని కూడా గిజిగాళ్లు సాధించి తరతరాల నుంచి తమ గూళ్ల నైపుణ్యంతో అబ్బురపరచడం గిజిగాడికి ఉన్న ప్రత్యేకత. ఎన్నో ఇంజనీరింగ్ చదువులు చదివి ఎన్నో నిర్మాణాలను చేపడుతున్న మానవ ఇంజనీర్లుతో సమానంగా ఎటువంటి చదువు సంధ్యలేని గిజిగాడి గూళ్ల నైపుణ్యం అద్భుతం, అమోఘం. అతి చిన్న సైజులో ఉండే చిన్న పిచ్చుకలాంటి గిజిగాళ్లు రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో ఐదేళ్లుగా బాగా పెరిగిపోయాయి. తాళ్లపాక చుట్టుపక్కల మన్నూరు చెరువు కాలువ వెంబడి, వత్తలూరు రోడ్డులో, రాజంపేట చుట్టుపక్కల ప్రాంతంలోను, పోలిచెరువు కాలువ ప్రాంతంలోను గిజిగాడి గూళ్లు వందల నుంచి వేలకు పెరిగిపోయాయి. అందంగా చూడముచ్చటగా కొంత పసుపురంగును పోలి కళ్లను మైమరిపించే ఈ చిన్నపాటి గిజిగాళ్లు చెరువు కాలువల గట్లలోను, నీటి పరీవాహక ప్రాంతాల్లోను పచ్చికబైళ్ల మధ్య సర్కారు కంపచెట్ల చివర, ఈతచెట్ల చివర, అనేక ముళ్లచెట్లను ఆధారం చేసుకుని వీటి సంతతిని పెంచుకుంటున్నాయి. ఎండకు, వానకు తడవకుండా కేవలం పక్షం రోజుల్లోనే ఎంతో అద్భుతమైన గూళ్లను ఏర్పాటు చేసుకుని ఆ గూళ్లకు తిరిగి బురదమట్టిని అంటించి ఆ బురదమట్టికి మినుగు బురుగులను పెట్టి తన గూటిలో రాత్రివేళ చీకటి లేకుండా మనం కరెంటు బల్బులు వెలిగించినట్లు మినగర పురుగుల లైటింగ్‌లో తమ బిడ్డలను పోషించుకోవడం గిజిగాడికే సాధ్యం. ఈ పక్షుల్లో మగపక్షి ఎంతో కీలకమైంది. గూడు పెట్టేది మగపక్షే. తన ప్రియురాలు ఆడపక్షికి నచ్చే రీతిలో చుట్టుపక్కల మైదాన ప్రాంతంలో ఉండే పచ్చగడ్డి పోసలను సేకరించుకుని పక్షం రోజుల్లో కనీసం వెయ్యికి పైబడి గడ్డిపోసలను సేకరించి ఆ గడ్డిపోసలను ఎండిపోయేలోపే ఎంతో నేర్పరితనంతో ఎండకు ఎండ కుండా, వానకు తడవకుండా కాకులకు, గద్దలకు అందకుండా హెల్మెట్ రూపంలో పైభాగాన్ని నిర్మించి తన సంతతిని పెంచుకోవ డానికి గుడ్లను పెట్టుకుని తమ పిల్లలను పెంచుకోవ డానికి గూడు కింది భాగంలో ప్రత్యేక అరను ఏర్పాటు చేసుకుని తనకు, తన ఆడ పక్షి ఉండడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేసుకోవడం ఈ గిజిగాడి గూడు మగపక్షి ప్రత్యేకత. ఈ అద్భుతమైన గిజగాడి గూడు అల్లిక మానవ ఇంజనీర్లకు సైతం అంతుబట్టదు.



శభాష్ నాగవేణి

కట్టుకున్న భర్తకు కంటి నరాలు దెబ్బతిని చూపుపోయింది. అయినా ఏమాత్రం నిరుత్సాహ పడకుండా.. ఒకరి వద్ద చేయి చాచకుండా.. తెల్లవారుజామునే లేచి సొంతంగా ఆటో నడుపుతూ మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి.. ఊరూరా అమ్ముతూ తన బిడ్డలను ఉన్నత చదువులు చదివిస్తూ మండలంలో శభాష్ నాగవేణి అనిపించుకుంటోంది మహిళ.

- అన్నీ తానై కుటుంబాన్ని నడిపిస్తున్న వైనం
- పల్లెపల్లెకూ ఆటోలో కూరగాయలు అమ్ముతూ కుటుంబ పోషణ



భర్తను కూర్చోబెట్టుకుని ఆటో తోలుతున్న నాగవేణి

బి.కోడూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భర్తకు కంటి నరాలు దెబ్బతినడంతో రాను రాను కంటి చూపు దెబ్బతిని పూర్తిగా కళ్లు కనిపించని భర్తతో కలిసి జీవిస్తూ కుటుంబానికి పెద్ద దిక్కైంది. తెల్లవారుజామునే తాను ఆటో తోలుకుని మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి పల్లెల్లో తిరుగుతూ కూరగాయలు అమ్మి కుటుంబాన్ని పోషించుకుంటోంది. అన్నీ తానై తన పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ శభాష్ నాగవేణి అనిపించుకుంటోంది ఓ మహిళ.

వివరాలిలా..బి.కోడూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కత్తి రమణయ్య 1995లో అంటే దాదాపు 30ఏళ్లకు పైగా కడప వద్ద బయనపల్లె గ్రామానికి చెందిన నాగవేణి అనే ఆమెతో వారి పెద్దలు పెళ్లి చేశారు. అప్పటికే భర్త రమణయ్యకు కంటిచూపు తగ్గుతూ రావడం, అది గమనించిన భార్య నాగవేణి కుటుంబానికి అన్నీ తానై కుటుంబాన్ని పోషిస్తోంది. అంతేకాకుండా కొంతకాలం ఒక ఆటోను బాడుగకు తీసుకుని డ్రైవరును పెట్టుకుని తన భర్తను ఆటోలో ఎక్కించుకుని మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో అమ్ముతూ జీవనం సాగిస్తోంది. రెండేళ్ల క్రితం ఆటో బాడుగ కట్టడం, కుటుంబ పోషణ ఇబ్బంది కావడంతో సొంతంగా ఆటోను కంతుల్లో తీసుకుని తనే ఆటోను నడుపుకుంటూ కూరగాయలు అమ్ముతోంది. కంటి చూపు మందగించిన తన భర్తను తెల్లవారుజామున 3గంటలకు ఆటోలో ఎక్కించుకుని బద్వేలు - పోరుమామిళ్ల పట్టణంలో మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేస్తోంది. పల్లెల్లో తిరుగుతూ కూరగాయలు అమ్ముకుంటూ మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి చేరుతుంది. ఇంటికి వచ్చిన తరువాత అన్నం వండి తన భర్త తాను తిని తమకున్న 4పశువులకు మేత కోసం పొలాలకు వెళుతుంది. ఈ విధంగా తమ పశువులకు వేసుకుని కుటుంబాన్ని పోషిస్తూపలువురు మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది నాగవేణి.



ఆటోలో కూరగాయలు విక్రయిస్తున్న నాగవేణి

బిడ్డలను ఉన్నత చదువులకు..

చూపు మందగించిన భర్తను వెంటబెట్టుకుని కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తూ తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివిస్తోంది. తమ కుమారుడు వినయ్‌కుమార్‌ను విజయవాడ వికాస్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదివిస్తోంది. పాప వైష్ణవిని గుంటూరు ఏసీ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివిస్తోంది. డబ్బుల కోసం చేయి చాచి ఏ ఒక్కరినీ అడగకుండా తన సొంత కష్టార్జితంతో కుటుంబాన్ని పోషించడమే కాకుండా తన పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుండడంతో పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. అధికారులు స్పందించి ఆమె కుటుంబానికి కొంత చేయూత అందిస్తే కుటుంబ బారాన్ని తగ్గించడమే కాకుండా ఆదుకున్నవారవుతారని వారు కోరుతున్నారు.



డ్రాగన్ సాగు.. ఆదాయం బాగు

- కరువు గడ్డపై సిరులు కురిపిస్తున్న పంట



కలిచెర్ల సమీపంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్స్ తోట

పెద్దమండ్యం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ కరువు గడ్డపై డ్రాగన్ ఫ్రూట్స్ సాగు లాభదాయకంగా మారింది. గతంలో ఆస్ట్రేలియా, అమెరికా దేశాల్లో అధికంగా ఉన్న ఈ పంటను ఉత్తర భారతదేశంతో పాటు మన ప్రాంతంలో కూడా సాగు చేయడం విశేషం. దీర్ఘకాల దిగుబడులు నికరాదాయంతో పాటు నష్టం లేని పంటగా పేరు పొందింది. ఈ పంట సాగుకు మొగ్గు చూపిన రైతన్నలు లాభాలు గడిస్తున్నారు. వివరాల్లోకెళ్తే... పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన రైతు షేక్ అజంతుల్లా తనకున్న ఏడు ఎకరాల్లో 1.5 ఎకరం డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నాడు. సస్యరక్షణ శ్రమ తక్కువ, ఆదాయం ఎక్కువ రావడంతో ఈ సాగుపై మక్కువ చూపాడు. ఆయన మాటల్లో.. మూడేళ్ల క్రితం డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలను మహారాష్ట్రలోని కోల్హాపూర్ నుంచి దిగుమతి చేసుకున్నాను. డ్రాగన్ ఫ్రూట్స్ సాగుకు ఎకరానికి 2 వేల మొక్కలు నాటడానికి రూ.4లక్షల నుంచి రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టాలి. ఈ పంట సాగు చేసిన సంవత్సరంలోనే దిగుబడులు వస్తాయి. రెండేళ్లల్లోనే పెట్టిన పెట్టుబడి చేతికి వస్తుంది. డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలకు కాల పరిమితి 22 సంత్సరాల నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని తెలిపాడు. వ్యవసాయ సాగు పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంట సాగు చేయడంతో నీరు ఆదా అవుతుందన్నారు. వీటికి సస్యరక్షణ శ్రమ తక్కువ, ఆదాయం ఎక్కువ వస్తుందని తెలిపాడు. ప్రతి సంవత్సరం నికరాదాయం వచ్చే పంటతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వెల్లడించారు. ఎలాంటి భూముల్లో అయినా ఈ పంటలు సాగు చేయవచ్చని, డ్రాగన్ ఫ్రూట్స్ నాణ్యత బట్టి మార్కెట్ కిలో ధర రూ.150 నుంచి రూ.200 పలుకుతోందన్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వచ్చి పంట దిగుబడులు కొనుగోలు చేస్తున్నారు. ఈ డ్రాగన్ ఫ్రూట్స్ పంటను సాగు చేసుకోవడానికి మన రైతులు దృష్టి సారిస్తే లాభాలు పొందవచ్చని రైతు అజంతుల్లా తెలిపారు.

అంతేకాకుండా ఈ ఫ్రూట్స్ తినడం వల్ల జీర్ణశక్తి పెరిగి, గుండె సమస్యలు తగ్గుతాయని, శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్ఠం చేసి, క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.


డ్రాగన్ ఫ్రూట్స్ లాభదాయక పంట



డ్రాన్‌ఫ్రూట్స్ లాభదాయక పంట. వర్షాభావ పరిస్థితులకు తట్టుకునే శక్తి పంటకు ఉంది.. పోషక విలువలు ఎక్కువగా ఉండడంతో మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయి.

-షేక్ అజంతుల్లా,
రైతు, కలిచెర్ల, పెద్దమండ్యం.

గండికోట నుంచి మైలవరానికి నీరు విడుదల



మైలవరం నుంచి పెన్నానదికి నీటిని వదులుతున్న దృశ్యం

కొండాపురం/మైలవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి సోమవారం 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తుఫాన్ ప్రభావం దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా గండికోట ప్రాజెక్టు వద్ద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా మెయిన్ కెనాల్‌కు 275 క్యూసెక్కుల చొప్పున విడు దల చేశామని తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.270 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా, మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 7వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలా శయ డీఈఈ నరసింహామూర్తి తెలిపారు. గండికోట జలాశయం నుంచి సాయంత్రానికి 5వేల క్యూసెక్కుల మేర నీటితో పాటు వర్షపునీరు వచ్చి చేరుతుండటంతో పెన్నాకు 7వేల క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 110 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మైలవరం జలాశయానికి రాత్రికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి వదిలే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఈ తెలిపారు. మైలవరం జలా శయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా. ప్రస్తుతం 5.9 టీఎంసీలు నీరు నిల్వ ఉంది.

ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

కడప (ఎడ్యుకేషన్) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా 5050 మంది ఎస్‌జీటీ, స్కూలు అసిస్టెంట్ల పోస్టుల కోసం డీఎస్సీలో ఇచ్చే ఉచిత శిక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కడప అసి స్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి లక్ష్మీనారాయణ ప్రకటనలో తెలిపారు. సెట్ అర్హత కలిగి ఉండి వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల్లోపు ఉన్న ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు జ్ఞాన భూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న స్ర్కీనింగ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని, మెరిట్ లిస్టు ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు జ్ఞానభూమి వెబ్‌సైట్ సందర్శించాలని కోరారు.

భారీ వర్షాల హెచ్చరికతో డిగ్రీ ఒకేషనల్ పరీక్ష వాయిదా

కడప (ఎడ్యుకేషన్) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలో ఈ నెల 15 నుంచి జర గాల్సిన డిగ్రీ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియం త్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాను ప్రభావం అన్నమయ్య, వైఎస్ఆర్ కడప జిల్లాలపై ఉంటుందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో యూనివర్శిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి నిర్ణయం మేరకు పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు వసతులు మెరుగు పరచాలి



అధికారులతో మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థులకు వసతులను మెరుగుపరచడంతో పాటు మంచి విద్యను అందించి ప్రయోజకులుగా తయారు చేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ప్రకాష్‌నగర్, బాలాజీనగర్, కో-ఆపరేటివ్ కాలనీలోని బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి వంటశాలను, వసతి గదులను, డైనింగ్ హాలును, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు, హెల్ప్‌లైన్ నెంబర్ 15100 తదితర వాటి గురించి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో బీసీ హాస్టల్ అధికారులు పాల్గొన్నారు.

రాయుడుకాలనీలో విద్యార్థిని ఆత్మహత్య



రాయచోటిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని రాయడుకాలనీలో సోమవారం విద్యార్థిని భవ్యశ్రీ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే..... రాయచోటి పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈవిద్యార్థిని తల్లి గత ఏడాది క్రితం బతుకు తెరువు నిమిత్తం కువైట్‌కు వెళ్లింది. ఈ క్రమంలో విద్యార్థిని తండ్రి రాజశేఖర్ కూడా కువైట్‌కు వెళ్లడం కోసం సోమవారం మెడికల్‌కు వెళ్లాడు. విద్యార్థిని అక్కచెల్లెళ్లు ముగ్గురు. ఇంట్లో తాతయ్య, నాన్నమ్మతో పాటు విద్యార్థిని ఉంటోంది. ఈక్రమంలో విద్యార్థిని ఆత్మహత్య పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న రాయచోటి అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై కుటుంబ సభ్యులను విచారిస్తున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు.

మద్యం దుకాణం చోరీ కేసులో నిందితుడు అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ జీవన్ గంగానాథ్‌బాబు

పులివెందుల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని కదిరి రింగురోడ్డులో ఉన్న ప్రభుత్వ వైన్‌షాపులో ఆగస్టు 13న జరిగిన దొంగతనం చేసిన కేసులో రెండో నిందితుడు అలెగ్జాండరును అరెస్టు చేసినట్లు సీఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు. పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మద్యం దుకాణం చోరీ కేసులో మొదటి నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని, రెండో నిందితుడు అయిన అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామానికి చెందిన అలెగ్జాండరును పులివెందుల అర్బన్ ఎస్ఐ నారాయణ తన సిబ్బందితో ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వృత్తిరీత్యా డ్రైవరు అయిన అలెగ్జాండర్ పులివెందుల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద సంచరిస్తూ ఉండగా అరెస్టు చేసి.. అతని వద్ద నుంచి లక్ష రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, కానిస్టేబుల్ రామ్, రమేష్, మహేశ్‌లు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



ఖాజీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పురుగుల మందు తాగి బాలగంగయ్య (40) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఖాజీపేట మండలం మూలవారిపల్లె గ్రామానికి చెందిన గంగయ్య ప్రతిరోజు మద్యం సేవించి ఇంటికి వస్తుండటంతో ఇంటి పెద్దలు మందలించారు. దీంతో మనస్థాపానికి గురై ఆదివారం మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగడంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

ఆధార్ తరహా... అపార్

- ప్రతి విద్యార్థికి ప్రత్యేక గుర్తింపుకార్డు
- తొలుత 9, 10, ఇంటర్ తరగతులకు జారీ
- ఈ నెలాఖరు వరకు నమోదు ప్రక్రియ





కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నూతన మార్పులు తీసుకువస్తోంది. ప్రతి విద్యార్థికి ఆధార్ తరహాలో అపార్ పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ పేరిట కేంద్రవిద్యాశాఖ 12 అంకెలతో కూడిన కార్డు మంజూరు చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను జిల్లాలో చేపట్టడానికి ఆశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు శాశ్వత విధానంలో ప్రత్యేక సంఖ్యతో కూడిన గుర్తింపు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తుంది. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో ఆధార్ తరహాలో కేటాయించనున్న ప్రత్యేక నెంబరు కోసం 9, 10, 11, 12 తరగతుల విద్యార్థుల వివరాలు యుడైస్ ప్లస్‌లో అప్‌డేట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. అన్ని యాజమాన్యాలు మేనేజ్‌మెంటు ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి ప్రస్తుతం పాఠశాలతో పాటు కళాశాల స్థాయిలో ఆధార్‌కార్డులోని వివరాలు నమోదు చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహిస్తున్న యుడైస్‌ప్లస్ వెబ్‌సైట్‌లో విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేకమైన నెంబరు కేటయింపు విధానం అమలులో ఉంది. అయితే సంబంధిత విద్యార్థి ఇంటర్ పూర్తి కాగానే యుడైస్ డేటా గడువు తీరిపోతుంది. డిగ్రీ, పీజీ విద్యలకు వెళ్లే విద్యార్థులకు సంబంధించిన అకడమిక్ ప్రగతి గతంలో చదివిన కోర్సుల వివరాలు నమోదు చేసే వ్యవస్థ లేకుండా పోతుంది. కేంద్రం అమలులోకి తీసుకువస్తున్న అపార్‌తో ఆయా సమస్యలకు చెక్ పడనుంది. ప్రతి విద్యార్థికి కేటాయించే విశిష్ట సంఖ్య ద్వారా సంబంధిత విద్యార్థికి సంబంధించిన అకడమిక్ ప్రగతి చదివిన కోర్సుల డేటా ప్రభుత్వం వద్ద ఉంటుంది.

ప్రయోజనాలు

- విద్యార్థులు వివిధ కారణాలతో పలు విద్యాసంస్థలకు మారుతుంటారు. అపార్ గుర్తింపు సంఖ్య ద్వారా వివిధ రాష్ట్రాల్లోని విద్యా బోర్డులతో ఏకీకృత వ్యవస్థగా పనిచేస్తుంది. ఒక విద్యాసంస్థ నుంచి మరో విద్యాసంస్థకు మారేటప్పుడు ఇబ్బందులు ఉండవు.
- అపార్ గుర్తింపుతో విద్యార్థులు డీజీ లాకర్‌కు అనుసంధానం అవుతారు. విద్య, విషయక విజయాలు ధ్రువపత్రాలను డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరచుకోవచ్చు. ఆయా ధ్రువపత్రాలను ఎక్కడైనా డిజిటల్ రూపంలో వినియోగించుకోవచ్చు.
- పిల్లల అకడమిక్ రికార్డుల పర్యవేక్షణ ద్వారా డ్రాపవుట్స్‌ను నివారించే అవకాశం ఉంది. విద్యార్థి ఏ కారణంతో అయినా పాఠశాలకు దూరం అయితే పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది.
- విద్యార్థుల ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రయోజనాలు, విద్యాసంస్థల్లో చేరికలు మార్పులు వంటి సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించే విధంగా రూపొందించారు.

తల్లిదండ్రుల అంగీకారంతో

విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారం తీసుకుని అపార్‌కు వివరాలు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపాల్స్‌కు అధికారులు సూచించారు. యుడైస్‌ప్లస్‌లో ఉన్న డేటాను విద్యార్థి అడ్మిషన్ నెంబరు, ఆధార్, తల్లిదండ్రుల వివరాలతో అప్‌డేట్ చేయడం ద్వారా అపార్‌కు ఆధారం తీసుకుంటారు. తొలివిడతలో 9, 10, 11, 12 తరగతుల వారికి అపార్ నెంబరు కేటాయించేందుకు తల్లిదండ్రుల నుంచి అనుమతి తీసుకునేందుకు దరఖాస్తు ఫారాలను ఆయా పాఠశాలలు, కళాశాలలకు పంపారు.

నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట

పాఠశాల నుంచి ఉన్నత చదువుల వరకు విద్యార్థులకు సంబంధించిన సమగ్ర డిజిటల్ సమాచార కేంద్రంగా అపార్ పనిచేయనుంది. వివిధ బోర్డులు, వర్శిటీలు జారీ చేసే ప్రతి సర్టిఫికెట్‌పై 12 అంకెలతో కూడిన అపార్ నెంబరు ముద్రిస్తారు. ముఖ్యంగా ఉద్యోగ నియామకాల సమయంలో సమర్పించిన సర్టిఫికెట్లపై అనేక ఫిర్యాదులు రావడం.. వాటి వివరాలను ధ్రువీకరించేందుకు సమ యం తీసుకోనుండడంతో ప్రతి దశలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో విద్యార్థుల జవాబుదారీతనం పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో పాఠశాలలు.. విద్యార్థుల వివరాలు

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు సంబంధించి 1988 పాఠశాలల్లో లక్షా 40వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అలాగే 66 ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి 7558 విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 776 పాఠశాలల్లో లక్షా 68 వేల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

జూనియర్ కళాశాలల్లో...

జిల్లాలో ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు సంబంధించి 20 కళాశాలల్లో 4911 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చదువుతున్నారు. అలాగే ఐదు ఎయిడెడ్ విద్యాసంస్థల్లో 691 మంది, 72 ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 23512 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో మొత్తం 97 జూనియర్ కళాశాలల్లో 29114 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ అపార్ నమోదు ప్రక్రియ జరగనుంది.

ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలి



విద్యార్థులకు అపార్ నెంబరు కేటాయించేందుకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల వారీగా ప్రిన్సిపల్స్‌కు జారీ చేశాం. తల్లిదండ్రుల అంగీకారం తీసుకుని యుడైస్ ప్లస్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్‌కు ఆదేశాలు జారీ చేశాం.

-రవి, ఇంటర్మీడియట్ విద్య ఆర్‌జేడీ

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప(కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు తక్షణం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, నేషనల్ హైవేస్ ఎస్డీసీ వెంకటపతి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీలతో కలసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదుదారులు ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పిసారని.. వారి విజ్ఞప్తులను సంబంధిత అధికారులు తెలుసుకొని పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కారాలు ఉండాలన్నారు పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ రీ ఓపెనింగ్ లేకుండా అర్జీలు పరిష్కరించాలన్నారు. అలాగే ఉదయం 9-30 గంటల నుంచి 10-30 గంటల వరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన డయిల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి జిల్లాలో నలుగురు బాధితులు తమ సమస్యలను డీఆర్వోకు ఫోన్ ద్వారా విన్నవించారు. తన భూమి రెండు ఎకరాలు ఉంటే రీ సర్వే తరువాత ఆన్‌లైన్‌లో 1.95 సెంట్లు మాత్రమే చూపిస్తోందని, తన భూమి మొత్తం 2 ఎకరాలు రికార్డుల్లో చూపాలని దువ్వూరు మండలం కామనూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి ఫిర్యాదు చేశారు. కడప మండలం చెమ్ముమియాపేట గ్రామ పొలంలో తనకు 1.01 ఎకరాల భూమి ఉండగా, ఇపుడు ఆన్‌లైన్‌లో వేరే వారి పేర్లు చూపుతోందని తనకు న్యాయం చేయాలని పుష్పగిరి రెడ్డన్న ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని డీఆర్వో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు విజయకుమార్, నాగేశ్వరావు, డాక్టర్ నాగరాజు, సరస్వతి, వెంకట్రావు, డాక్టర్ బ్రహ్మయ్య, జయసింహ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుబజారులో వంటనూనెల అమ్మకం

కడప రూరల్, అక్టోబర్ 14: కడప రైతు బజారులో ప్రభుత్వ ఆదేశాల మేరకు కడప సౌత్‌రన్ ఆయిల్ డిపో ఆధ్వర్యంలో సరసమైన ధరలకు వంట నూనెలను విక్రయిస్తున్నట్లు సివిల్ సప్లైయ్ శాఖ ఏఎస్‌వో తారక్‌నాథ్‌రెడ్డి, కడప ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తి, ఎంఎల్ ఆర్ఐ సందీప్‌లు తెలిపారు. సోమవారం రైతుబజారులో ఏర్పాటు చేసిన వంటనూనెల దుకాణాన్ని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధరలలో 850 గ్రాముల పామాయిల్ ప్యాకెట్ రూ.110లకు, అలాగే 910 గ్రాముల సన్‌ఫ్లవర్ అయిల్ ప్యాకెట్ రూ.124లకు అందించడం జరుగుతోందన్నారు. ఒక రేషన్ కార్డుకు 3 పామాయిల్ ప్యాకెట్లు, 1 సన్‌ఫ్లవర్ ప్యాకెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వివాహం చేసుకున్న ప్రేమజంటకు కౌన్సెలింగ్

మదనపల్లె అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయి వివాహం చేసుకున్న ప్రేమజంటకు సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ చాంద్‌బాషా బంధువుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెకు చెందిన సీతారామప్ప, శంకరమ్మల కుమార్తె సి.మౌనిక(19) మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతుంది. సెప్టెంబరు 29న తండ్రి సీతారామప్పతో కలిసి స్వగ్రామానికి వెళ్లేందుకు చిత్తూరు బస్టాండులో బస్సు ఎక్కే సమయంలో మౌనిక అక్కడ నుంచి అదృశ్యమైయింది. అక్టోబరు 3న మౌనిక తల్లి శంకరమ్మ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కూతురు అదృశ్యం అయిందంటూ ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా విచారణ చేసి రామసముద్రం మండలం, చెంబకూరు పంచాయతీ దిన్నెమీద హరిజనవాడకు చెందిన వెంకటప్ప, శ్యామల కుమారుడు శ్రీనివాసులు (23)తో మౌనిక వివాహం చేసుకున్నట్లు తెలిపారు. ప్రేమజంటను సోమవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఖాజాబీ ఎదుట హాజరుపరిచారు. స్టేషన్‌లో పూలదండలు మార్పించి బంధువుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. వివాహనికి అర్హులైన ప్రేమ జంటను పెద్దలను ఒప్పించి లేదా చట్టబద్ధంగా పోలీసులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆశ్రయించి పెళ్లి చేసుకోవాలే కానీ సారిపోయి తల్లిదండ్రులను, పోలీసులను ఇబ్బందులకు గురిచేయడం మంచి పద్ధతి కాదన్నారు.

అల్పపీడన ప్రభావంతో వర్షాలు

- జిల్లా అంతటా 144.2 మి.మీ వర్షపాతం

కడప రూరల్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్పపీడం ఏర్పడింది. దీంతో 17 వరకు జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతారణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారు జామునుంచి జిల్లాలో వర్షం ప్రారంభమైంది. జిల్లా అంతటా 144.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇందులో కడప డివిజన్‌లో 57.0, బద్వేల్ డివిజన్‌లో 74.2, జమ్మలమడుగు డివిజన్‌లో 12.0, పులివెందుల డివిజన్‌లో 1.0 మి.మీ నమోదైంది. సిద్దవటం మండలంలో అత్యధికంగా 29.6 మి.మీ, చాపాడు మండలంలో అత్యల్పంగా 0.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగా.. 17వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉండడంతో జిల్లా వ్యవసాయశాఖ వరి, వేరుశనగ, పత్తి, కంది, పప్పుశనగ రైతులను అప్రమత్తం చేసింది. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రస్తుత పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు.

లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి

కడప(కలెక్టరేట్), అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తుఫాను కారణంగా జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంతో పాటు కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని తెలిపారు. భారీ వర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారం తెలుసుకునేందుకు, ఫిర్యాదులను ఈ కంట్రోల్ రూములకు తెలపాలని సూచించారు.

వరద బాధితులకు మిట్స్ చేయూత



మంత్రి లోకేష్‌కు చెక్కును అందజేస్తున్న కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి

కురబలకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) విజయవాడలో సంభవించిన వరద బాధితుల సహాయార్థం మిట్స్ యాజమాన్యం చేయూత నందించింది. మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళా శాల కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి తన సొంత నిధులతో పాటు కళాశాల సిబ్బంది ద్వారా సేకరించిన రూ.19లక్షల విరాళాన్ని అందజేశారు. కాగా ఈ విరాళాన్ని విజయవాడలో మంత్రి నారాలోకేష్‌ని కలిసి సీఎం సహాయనిధికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయాల్లో ప్రతి ఒక్కరూ చేయూతనందించి ఆదుకోవాలన్నారు. అనంతరం కరెస్పాండెంట్‌ను మంత్రి లోకేష్ అభినందించారు.

రుణాల కోసం రైతుల ఆందోళన

- ఆంధ్రప్రగతి సొసైటీ బ్యాంకుకు తాళం వేసి నిరసన



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సొసైటీకి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కొండాపురం, అక్టోబరు 14: మండలంలోని తాళ్లప్రొద్దుటూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సొసైటీ ఎదుట రుణాలు ఇవ్వాలంటూ సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. రైతునేస్తం పథకం కింద రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదని రైతులు సిబ్బందిని బైటకు పంపించి, బ్యాంకుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా అడుగుతున్నా మేనేజరు పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ భూములను ఆయ కం పెట్టుకుని రుణాలు ఇవ్వమని కోరుతున్నా మేనేజరు స్పందించడం లేదని అన్నారు. మేనేజరుకు నచ్చిన వారికే రుణాలు ఇస్తూ తమను తిప్పుకుంటున్నారని నరసింహారెడ్డి అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు న్యాయం జరిగేల రుణాలు ఇప్పించాలని రైతులు బ్యాంకు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పీవీ నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు, ఏటూరు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు మహర్దశ

వేంపల్లె, అక్టోబరు 14: కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు మహర్దశ పట్టనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం సిఫారసు మేర కు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ నుంచి స్థానిక సంస్థలకు రూ.988.77కోట్లు విడుదల చేశారన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేద్దాం: డీఎస్పీ


బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలకు సమష్టిగా కృషిచేసి అడ్డుకట్ట వేద్దామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, అక్రమ రవాణాపై నిఘా ఉంచుతామన్నారు. అల్లర్లకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని, నేర చరిత్ర కలిగిన వారిపై నిరంతరం దృష్టిపెడతామని, ఎవరైనా పదే పదే గొడవలకు పాల్పడితే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా కడపలో పలు పోలీసుస్టేషన్‌లలో విధులు నిర్వహించారు. 2006లో సీఐగా పదోన్నతి పొందారు. సీఐగా ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహించారు. డీఎస్పీగా పదోన్నతి పొందిఆయన సీఐడి విభాగంలో విధులు నిర్వహిస్తూ కడప సబ్ డివిజనల్ అధికారిగా బదిలీపై వచ్చారు.

పల్లెతల్లికి పండగొచ్చింది

మన జాతిపిత మహాత్మా గాంధీ మాటను ఇప్పుడు తప్పక ప్రస్తావించుకోవాల్సిందే.. ఎందుకంటే నాడు గాంధీతాత కన్న గ్రామస్వరాజ్యం కల నేడు నెరవేరబోతున్నందుకు.. కూటమి ప్రభుత్వం గాంధీజీ ఆశయాలను నెరవేర్చనుంది. అన్ని గ్రామాల్లో మౌలిక వసతు లు కల్పించాలనే వజ్ర సంకల్పంతో అందుకు అవసరమైన నిధులు సమకూర్చి పనులు ప్రారంభిస్తోంది. ఇంతవరకు అరకొర వసతులతో అల్లాడిన నా పల్లెతల్లికి పండగొచ్చింది.. ఊరూరా పల్లెపండుగ పనులు సందడి చేస్తున్నాయి..


రామనపల్లెలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

టీడీపీతో ప్రతి గ్రామంలో మౌలిక వసతులు

● సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. ● నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి


మాట్లాడుతున్న మారెడ్డి రవీంద్రనాథరెడ్డి

పులివెందుల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్లెపండగ, పంచాయతీ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం పులివెందుల మండలంలోని ఎర్రిపల్లి గ్రామంలో పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక వసతులు పూర్తిగా కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రతి ఏడాది గ్రామసభ నిర్వహించుకుని అందులో గ్రామానికి కావాలసిన అత్యవసర పనులను ప్రజలందరూ కలిసి తీర్మానం చేసుకుని ఒకదాని తరువాత ఒకటి పూర్తి చేస్తామన్నా రు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 4500 కోట్ల నిధులతో వేల కిలోమీటర్లు సిమెంటు రోడ్లు ఎనిమిది లక్షల మంది కుటుంబాలకు వంద రోజుల పని, 25వేల గోకులాల నిర్మాణాలు తదితర అభివృద్ధి, నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఏడాది గ్రామానికి మౌలిక వసతులన్నింటినీ కల్పిస్తామన్నారు.

వైసీపీలో ఉత్సవ విగ్రహాల్లా సర్పంచులు

గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల్లో అభివృద్ధి జరగలేదని గ్రామ సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారని బీటెక్ రవి అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గ్రామంలో గ్రామ స్వరాజ్యం తీసుకువస్తామన్నారు. అందులో భాగంగానే 4500 కోట్ల నిధులతో మౌలిక వసతుల కల్పనను ప్రతి గ్రామంలో కల్పించడంలో భాగంగా నిధులు మంజూరయ్యారన్నారు. మండల ఇన్‌చార్జ్ మారెడ్డి జోగిరెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, బాస్కర్‌రెడ్డి., చెన్నకేశవరెడ్డి తదితర గ్రామ నాయకులు, కూటమి నాయకులు, అధికారులు, సంబంధిత అ ధికారులు పాల్గొన్నారు.

పల్లె పండుగలో రూ.5.20 లక్షలతో సీసీ రోడ్డు

పులివెందుల రూరల్ (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: పులివెందుల మండలంలోని ఆరు పంచాయతీలకు గాను ఐదు పంచాయతీలలో రూ.43లక్షల ఉపాధి నిధులతో సిమెంటు రోడ్డు, కాంపౌండ్‌వాల్ పనులు చేయనున్నారు. సోమవారం మండలంలోని ఎర్రిపల్లె గ్రామంలో రూ.5.20 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, ఏపీడీ సుబ్బారెడ్డి, పీఆర్ ఏఈఈ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న అధికారులు

సీకేదిన్నె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చింతకొమ్మదిన్నె మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధిపరచి ఆదర్శంగా తీర్చి దిద్దుతామని ఎంపీడీఓ కుళాయిబాబు తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె, బుసిరెడ్డిప ల్లె పంచాయతీల్లో సోమవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గ్రామాల్లో కావాల్సిన అన్ని రకాల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అవసరమైన నిధులు అందిస్తోందన్నారు. ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం ఏయే పనులు చేయాలో గుర్తించి వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఈఓఆర్డీ సుబ్బారెడ్డి, ఏపీఓ రామాంజనేయుల రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇక పల్లెలు ఆనందంతో తులతూగుతాయి

చెన్నూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇకపై పల్లెలు ఆనందంతో తులతూగుతాయని కూ టమి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలకు పండుగ వచ్చిందని దీని ద్వా రా అన్ని పల్లెలు ఆనందంతో తులతూగుతాయని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. మండలంలోని చిన్నమాచుపల్లె హైవే రహదారి నుండి రామనపల్లె వరకు గ్రామ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప ల్లెపండుగలో భాగంగా వేయబోయే 80 లక్షల సిమెంటు రోడ్డుకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, ఉప ము ఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా మంచి రహదారులు ఏర్పాటు అవుతాయన్నారు. గత ఐదేళ్లలో ప్రతి గ్రామంలో రోడ్ల దుస్థితి ఎలా ఉందో అందరికీ తెలిసిందేనన్నారు. భవిష్యత్తులో రోడ్డు సమస్య అనేదే ఉండకుండా చేస్తామన్నారు. 2003లో చిన్నామాచుపల్లె నుంచి రామనపల్లెకు టీడీపీ పాలనలోనే రోడ్డు వేశామని గుర్తు చేశారు. 2014-19లో టీడీపీ పాలనలోనే మెయింటెనెన్స్ వర్క్ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశామన్నారు. ఆ తరువాత వచ్చిన పాలకులు ఈ రోడ్డుమాటే మరిచారన్నారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ ఐ.శివారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు అల్లాడు రాజశేఖర్‌రెడ్డి, వేల్పుల సుబ్రమణ్యం, యామల మణికంఠ, మన్నూరు అక్బర్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జున రెడ్డి, టీడీపీ జిల్లా మైనార్టీ నేత షబ్బీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే

వల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వల్లూరు మండలంలో రూ. రెండున్నర కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. సోమవారం ప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా వల్లూరులోని కస్తూర్బా పాఠశాలకు సంబంధించి మెయిన్‌రోడ్డు నుంచి పాఠశాల వరకు దాదాపు రూ.10లక్షల వ్యయంతో మెటల్ రోడ్డు పనులకు శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కస్తూర్బాకు డార్మెటరీతో పాటు టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. అనంతరం ఉపాధి కూలీలతో మమేకమయ్యారు. పనులు త్వరలో సమృద్ధిగా కల్పిస్తామన్నారు. మండలంలో 25 గోకులాలతో పాటు పలు సిమెంటు రోడ్లు పూర్తిచేస్తామని, ఏమైనా అవసరమైతే తమ దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. డీపీఓ రాజ్యలక్ష్మి, ఉపాధి అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, స్థానిక ఏపీడీలతో పాటు విద్యా, వైద్య, సిబ్బంది, ఎంపీడీఓ రఘురాం, స్థానిక కార్యదర్శి శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వేముల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కె.కె.కొట్టాల, వేముల గ్రామ పంచాయతీల్లోని 9.50లక్షల రూపాయలతో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

సింహాద్రిపురంలో...

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తోందని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ నెల 20 వరకు జరిగే పల్లె పం డుగ వారోత్సవాల్లో భాగంగా చవ్వారుపల్లెలో గోకులం షెడ్డు నిర్మాణం కోసం భూమిపూజ చేసి ఎంపీడీఓ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించండి: అడిషనల్ కమిషనర్


అర్జీలు స్వీకరిస్తున్న రాకేశ్‌చంద్రం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఇచ్చే సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ రాకేశ్‌చంద్రం తెలిపారు. సోమవారం కడప కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్‌హాలులో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 16 అర్జీలు వచ్చాయన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 6, రెవెన్యూ విభాగం 5, టౌన్ ప్లానింగ్ 3, హెల్త్ విభాగం 1, ఎడ్యుకేషన్ 1 వచ్చాయని తెలిపారు. వీటిని అధికారులకు పంపామని, వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. ఎంహెచ్ఓ చంద్రశేఖర్, ఈఈ ధనలక్ష్మి, నారాయణస్వామి, అసిస్టెంటు సిటీ ప్లానర్ నాగేంద్ర పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే


టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పార్టీబలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. కడప నగరం 29వ డివిజను ఊరగాయల వీధిలో ఆర్యవైశ్య యువశక్తి జిల్లా అధ్యక్షుడు రాముతో పాటు అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధేయులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

విద్యార్థుకందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. సోమవారం గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలులో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జ తిరుమలేశ్, టీడీపీ నాయకులు చంద్రమోహన్, రంజిత్, బాబు పాల్గొన్నారు.

మెడికోలకు ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మొదటిసంవత్సరం వైద్యవిద్య ప్రారంభమైన ఈ రోజున వైద్యసేవలకు ప్రిన్సిపాల్ సురేఖ, వైస్‌ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి విద్యార్థులకు ఆహ్వానం పలికారు. ఈ సమావేశంలో దీప ప్రజ్వలన అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యసేవకు అంకితం కావాలంటే అకుంఠిత దీక్ష, పట్టుదల, సేవా భావం కలిగి ఉండాలన్నారు. ప్రతి దినం అధ్యాపకుల సూచనలతో విద్యను నేర్చుకోవాలన్నారు. మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలంటే వ్యాయా మం తప్పనిసరి, అందుకు విశాలమైన కాలేజీ గ్రౌండ్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. మానవసేవే మాధవసేవ కాబట్టి ప్రతిరోగికి వైద్య సహాయాన్ని శ్రద్ధగా చే యాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ సునీల్, డాక్టర్ లక్ష్మినరసమ్మ అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

హైవే పనులు పూర్తి చేయకపోతే కేసులు: ఎమ్మెల్యే

చెన్నూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : హైవేకు సంబంధించిన పనులు పూర్తి చేయకపోతే కేసులు నమోదు చేయిస్తామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ సభా భవన్‌లో ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే పాత టోల్‌గేటు వద్ద రోడ్డు విస్తరణ ఎక్కువగా ఉన్నందున రెండు వైపులా కాంక్రీటు దిమ్మెలు రక్షణగా ఏర్పాటు చేయాలని కోరితే ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. హైవే రహదారిపై లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.చెన్నూరు క్రాసింగ్ వద్ద లైటింగ్ లేక ఎన్నోప్రమాదాలు జరుగుతున్నాయని, నిర్మాణం ఎందుకని ఆగ్రహించారు. కొత్తరోడ్డు హైవే రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు, డ్రైన్లు, లైటింగ్ సిస్టం త్వరలో ఏర్పాటు చేయాలన్నారు.

'సింగపూర్ టౌన్‌షిప్‌లో సెల్‌టవర్‌కు అనుమతులొద్దు'

కడప మారుతీనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కడప నగర శివారులోని రిమ్స్ సమీపంలో గల సింగపూర్ టౌన్ షిప్‌లో సెల్ టవర్ అనుమతులు వద్దంటూ సింగపూర్ టౌన్‌షిప్‌వాసులు చంద్రమౌళీశ్వర్‌రెడ్డి గురప్ప, చంద్ర ఓబుల్‌రెడ్డి, రవికుమార్ తెలిపారు. సోమవారం కడప నగరంలోని వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగపూర్ టౌన్ షిప్‌లో రాఘవరెడ్డి అనే వ్యక్తి ఓనరు కాకపోయినా అసోసియేషన్ ఏర్పాటు చేసి టవర్ ఏర్పాటు చేయడానికి స్థలాన్ని లీజుకు ఇచ్చారని తెలిపారు. కార్పొరేషన్ వారి ఆధీనంలో ఉన్నప్పటికీ స్థలాన్ని ఒక వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఒక ప్రైవేటు సంస్థ ఎలా దారాదత్తం చేస్తారని ప్రశ్నించారు.

నగర పంచాయతీ అభివృద్ధి పరుగు తీయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నగర పంచాయతీ అభివృద్ధి లో పరుగుతీయాలని ఆదిశగా అధికారులు, కౌన్సిలర్లు ముందుండాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జమ్మలమడుగు నగర పంచాయతీ సాధారణ సమావేశం జరిగింది. సమావేశం లో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మున్సిపాలిటీలో డ్రైనేజీ, రోడ్లు, తదితర సమస్యలను వెనువెంటనే పరిష్కారం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఉన్న సమస్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముల్లాజానీ, ముని సుబ్బారెడ్డి, సింగరయ్య, పోచిరెడ్డి వైస్‌ఛైర్మన్-2 సింగరయ్య ఛైర్‌పర్సన్ శివమ్మ, కౌన్సిలర్లు బాణా శివరామలింగారెడ్డి, నూర్జహాన్, సలోమి, లక్ష్మీదేవి, అధికారులు నేషనల్ హైవే ఏఈ సురేంద్రారెడ్డి, విద్యుత్తు డీఈ రాజగోపాల్ తదితర అధికారులు పాల్గొన్నారు. కాగా పనితీరు మారాలని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో విద్యుత్తు సమస్యపై అక్కడ పనిచేస్తున్న సిబ్బందిలో ఒకరిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ నీ ఉద్యోగాన్ని కలెక్టర్ ఇప్పించారని అనుకుంటున్నావేమో, నీ ఉద్యోగానికి పోస్టు మార్పం తప్పదని హెచ్చరించారు. ఇదే పరిస్థితి అందరికీ ఉంటుందనే విధంగా హెచ్చరికలు చేశారు. ప్రత్యేకంగా మీడియా వారిని సమావేశానికి పిలిచి మధ్యలోనే బయటికి వెళ్లిపోవాలని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఒకేసారి మీడియావారందరూ వెళ్లిపోవడం జరిగింది.

నూతన రామాలయం ప్రారంభోత్సవం

ముద్దనూరు అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):మండల పరిధి తిమ్మాపురం గ్రామంలో నూతన ఆత్మారామస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు పూజా కార్యక్రమాలు, శ్రీఆత్మారామస్వామి ,హనుమ, ధ్వజ, శిఖర పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పల్లెల రూపు రేఖలు మార్చడమే కూటమి లక్ష్యం





ప్రొద్దుటూరు..చౌటపల్లెలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మైలవరంలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి, బీ కోడూరు... తంగేడుపల్లె గ్రామంలో మెటల్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, సర్పంచ్ లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : పల్లెల రూపు రేఖలు మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్య మని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చౌటపల్లె గ్రామంలో 65 లక్షలతో ఉపాధి హామీ పథకం కింద రోడ్ల నిర్మాణపనులను ఎమ్మెల్యే ప్రారం భించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్య నారాయణరెడ్డి పంచాతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి.చౌటపల్లె టీడీపీ నాయకుడు మార్తల లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

దొరసానిపల్లెలో..: మండల పరిధిలోని దొరసానిపల్లెలో 3.8 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి సాంబశివారెడ్డి టీడీపీ నాయకుడు అరవ మునివర మాడెం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మైలవరం..: రాష్ట్రంలోని అన్ని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. సోమ వారం మండల కేంద్రమైన మైలవరం, దొమ్మర నంద్యాల పంచాయతీల్లో పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి తదితరులు ఉపాధి హామీ పథకంలో రూ.2.17 కోట్ల రూపాయలతో పనులు చేపట్టి పూర్తయిన సిమెంట్ రోడ్లను అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మైలవరంలోని బీసీ హాస్టల్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి, డీడీవో సుబ్రమణ్యం, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ శ్యాం సుందర్‌రాజు, డీఈ భాస్కర్‌రెడ్డి, ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఏపీడీ రామలింగేశ్వరరెడ్డి, ఏపీఓ ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు చేరెడ్డి చెన్నకేశవరెడ్డి, శేఖర్, చంద్ర,రాజారెడ్డి,భూసిరెడ్డి,ఖాదర్, సుబ్బరాయుడు, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ముద్దనూరు..: మండల పరిధి బొందలకుంట గ్రామంలో సోమవారం అధికారులు గ్రామ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పల్లె పండుగ కార్యక్రమంలో నిర్వహించారు. అందులో భాగంగా రూ.9.30లక్షలతో ఏర్పాటు చేయు సీసీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి, ఎంపీడీవో ముకుందారెడ్డి, సర్పంచ్ మునీశ్వరి, ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బి.కోడూరు..: బి.కోడూరు మండలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు.సోమవారం పల్లెపండుగ కార్యక్రమం లో భాగంగా తంగేడుపల్లె గ్రామం లో సర్పంచ్ గోడి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో 20లక్షల రూపాయలతో మెటల్ రోడ్డు నిర్మాణా నికి భూమి పూజ చేశారు. అలాగే ప్రభలవీడు గ్రామ పంచాయతీలో రూ.18లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి,మినీ గోకులాలకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, పీఆర్‌ఏఈ నారాయణ రెడ్డి, ఏపీవో రాజా, వీసీ ఖాజా, ఏవో కౌశిక, ఏపీయం సీతారామిరెడ్డి, ఈవోపీఆర్‌డీ బాల క్రిష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, ఓ.రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, గోడి భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామి రెడ్డి,రామసుబ్బారెడ్డి,సిద్దారెడ్డి,శేషారెడ్డి పాల్గొన్నారు.

అట్లూరు..: అట్లూరు మండలం లోని 12 గ్రామ పంచాయతీలకు 2.26 కోట్ల ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. సోమవారం కమలకూరు, మన్యంవారిపల్లె, మాడపూరు గ్రామాల్లో పల్లెపండుగలో భాగం గా ఆరు సిమెంటు రోడ్లు, నాలుగు గోకులం షెడ్లకు 50.52 లక్షల నిధులతో మండల టీడీపీ నాయకులు మంచూరు సూర్యనారాయణరెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, మన్నెం మహేశ్వర్‌రెడ్డి, లేవాకు రామక్రిష్ణారెడ్డి, సుదర్శనరావు, రామ సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి పనులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌బాబు, పీఆర్‌ఏఈ హసీనా, ఏపీవో జయచంద్ర, పంచాయతీ సెక్రటరీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కాశినాయన..: ప్రతి పల్లెను ప్రగతి పథంవైపు నడిపించడమే ప్రభుత్వ ధ్యేయమని పంచాయతీరాజ్ ఏఈ బాల పుల్లయ్య,ఈవోపీఆర్డీ ముజఫర్‌రహీం పేర్కొన్నారు.సోమవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఇటుకులపాడు, అమగంపల్లె గ్రామాల్లో సిమెంట్ రోడ్లకు భూమి పూజ నిర్వహించారు. ఉపాధి ఏపీవో జయరాముడు పలువురు అధికారులు, నేతలు పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని పిడుగుపల్లె పంచాయతీలో సోమవారం పల్లెపండుగను ఎంపీడీవో మహబూబ్‌బీ ప్రార ంభించారు. కార్యక్రమంలో పిడుగుపల్లె, అక్కిసిద్దుపల్లె, ముద్దంవారిపల్లె గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు.కార్య క్రమం లో సిబ్బంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లేపల్లె గ్రామ పంచాయతీలో సోమవారం పల్లెపండుగ కార్యక్రమాన్ని సర్పంచ్ చిలమల లక్ష్మీదేవి మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్‌నగర్ గ్రామంలో రూ.5లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం, ఎంపీపీ ప్రభుత్వ పాఠశాలకు రూ.3.40లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంగమునిరెడ్డి, టీడీపీ నేతలు చిలమల నాగయ్య, మేకల సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి అన్నారు. సోమవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా అప్పనపల్లె, నాగసానిపల్లె, ఆంజనేయకొట్టాలు పంచాయతీల్లో పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో దివిజ హాజరయ్యారు. మండలంలో 42 రోడ్లను గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, టీడీ పీ నాయకులు బండి వెంకటేష్, ఈశ్వర్, రమణ, నారాయణ, గంగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని నాగులపల్లె, ఖాదర్‌పల్లె, పల్లవోలు గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ వారోత్సవాల సందర్భంగా అధికారులు భూమిపూజ చేశారు. ఉపాధి ఏపీవో జగదీష్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామానుజులు , ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణి, మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామాంజనేయులు, రామమోహన్, జైనుల్లా, నాయబ్‌రసూల్, నాగేశ్వరరెడ్డి భూమి పూజ చేశారు. నాగులపల్లె గ్రామంలో రూ.10 లక్షలతో, పల్లవోలులో రూ.1.20 లక్షలతో, ఖాదర్‌పల్లెలో రూ.13.5 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నట్లు ఏపీవో చెప్పారు.

పోరుమామిళ్ల..: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.53 లక్షల అభివృద్ధి పనులకు పోరుమామిళ్ల సర్పం చ్ యనమల సుధాకర్ ఆధ్వర్యంలో శంకుస్థాప న నిర్వహించారు. సోమవారం పోరుమామిళ్ల పంచాయతీలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయం నుండి బెస్తవీధి వరకు హఫీజ్ ఇంటి వద్ద మరికొన్ని ప్రాంతాల్లో దాదాపు 53 లక్షల రూపాయలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణారెడ్డి, ఉపాధి ఏపీవో రవీంద్రరెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపవరం..: గోపవరం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించి పల్లెపండుగ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రామ్‌నాధరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో గోపవరం మండలానికి కోటి 26లక్షలతో పల్లెపండుగ వారోత్సవాలు ఘనంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జయరామిరెడ్డి జిల్లా పార్లమెంటు రైతు కమిటీ కార్యదర్శి యల్లారెడ్డి, టీడీపీ నాయకులు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఈవోపీఆర్‌డి షేక్ హసీనా, ఏఈ శ్రీహరి, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● పెన్నానదిలోకి ఎవరూ వెళ్లరాదని అధికారులు ఆదేశాలు



పెన్నానదిలో బైపాస్ రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

జమ్మలమడుగు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మైలవరం పెన్నానది పరిసర ప్రాంతాల్లో వరద ఉధృతి నీటి ప్రవాహం జోరుగా కొనసాగుతోంది. రెండు నెలలుగా జమ్మలమడుగు పట్టణంలోని మిరాయిగిరి హైస్కూలు పట్టణం నుంచి పెన్నానదిలో నాపరాళ్ల గనుల దారి వేపరాల వెళ్లే రోడ్డు వరద ప్రవాహంతో ఉంది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే మండలంలోని పి.సుగుమంచిపల్లె, పెద్దదండ్లూరు గ్రామాల మధ్య పెన్నానదిలో రోడ్డు కోతకు గురికావడం, రాకపోకలు లేవు.

తుఫాను హెచ్చరికలు..: జమ్మలమడుగు, మైలవరం పెన్నానది పరిసర ప్రాంతాల్లో సోమవారం నుంచి గురువారం వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. బయటి ప్రాంతాల నుంచి గండికోట, గురప్పస్వామి వద్దకు వెళ్లేవారు పెన్నానదిలోకి వెళ్లకూడదని కోరారు. తుఫాను ప్రభావం వలన మైలవరం జలాశయం నుంచి వరదనీరు పెన్నానదికి విడుదల చేయడం వలన హెచ్చరికలు చేస్తున్నట్లు, కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లుఆయన తెలిపారు.

జెన్‌కో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● పోస్టుకార్డు ద్వారా సీఎంకు వినతి

ఎర్రగుంట్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఎంకు ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికులు పోస్టు కార్డు ద్వారా విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆర్టీపీపీలో ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ పిలుపులో భాగంగా సీఎం చంద్రబాబుకు పోస్టు కార్డులు రాసి పంపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ఏపీ జెన్‌కోలో కార్మికులు 15 నుంచి 20సంత్సరాల నుంచి పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికి వారికి చాలీచాలని జీతాలే ఇస్తున్నారన్నారు. ఉద్యోగులకు సీనియారిటి ప్రకారం పదోన్నతి ఉంటుందని అయితే కార్మికులకు మాత్రం ఎలాంటి ప్రమోషన్ లేకుండా ఏళ్లతరబడి చేస్తున్నారన్నారు.ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బద్వేలుటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని సిద్దవటం రోడ్డు భాకరాపేట సబ్ స్టేషన్ సమీపంలో బైక్‌ను పాల ఆటో ఢీ కొనడంతో ఎస్.రవి (25) అనే వ్యక్తి మృతి చెందాడు. బద్వేలు మండలం ఎత్తిరాజుపల్లె గ్రామానికి చెందిన రవి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కూలి పనుల నిమిత్తం భార్యతో కలిసి సోమవారం సిద్దవటం వెళుతుండగా పాల ఆటో ఢీ కొనడంతో రవికి తలకు బలమైన గాయమై అధికంగా రక్తం పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్యకు గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వా సుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కస్టమర్ల సేవలో కెనరా బ్యాంక్

ముద్దనూరు అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):కస్టమర్ల సేవలో కెనరా బ్యాంకు ముందుకు పోతోందని కెనరా బ్యాంక్ కడప డివిజనల్ అధికారి సుబ్బరాయుడు పేర్కొన్నారు. స్థానిక కెనరా బ్యాంక్‌లో సోమవారం కస్టమర్ల సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా సీనియర్ కస్టమర్ పుల్లారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ వెంకట కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిట్ నిర్వహించాలి

ప్రొద్దుటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులపై ఆడిట్ చేసే విధానం లేక ప్రజా ప్రతినిధులు, అధికారులు పనులు చేయకనే నిధులు డ్రా చేస్తున్నారని ప్రజాపక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మీరెడ్డి ఆరోపించారు. సోమవారం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందజేశారు. పవన్‌కళ్యాణ్ పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులపై ఆడిట్ జరిగేలా చర్యలు తీసుకోవాలనిఆయన కోరారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో మంచులింగం



ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కొర్రపాడురోడ్డులో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వైఎంఆర్ కాలనీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమర్‌నాథ్ మంచులింగం నమూనా భక్తులను ఆకట్టుకుంటోంది. దసరా ఉత్సవాల్లో భాగంగా కొండ గృహల మధ్య మంచుతో రూపొందించిన ఒకటిన్నర అడుగుల మంచు శివలింగాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ఆంధ్ర, కర్ణాటక సబ్‌జోన్ అడిషనల్ ఇన్‌చార్జి రాజయోగిని గీతాబెహన్‌జీ, వైఎంఆర్ కాలనీ ఓంశాంతిభవన్ ఇన్‌ఛార్జి హేమా, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి

గోపవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం నూతనంగా ఇన్‌ఛార్జ్ తహసీల్దారుగా నియమితులైన త్రిభువన్‌రెడ్డి ఆయా గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు అన్నివేళాల అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలందించాలన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అంది స్తామన్నారు. త్వరలో రేషన్‌షాపులు బైఫరికేషన్ చేస్తామన్నారు. అదే విధంగా 20 సంవత్సరాలకు ముందు ఉన్న డీకేటీ పొలాల పట్టాల విషయంపై విచారణ చేస్తున్నామన్నారు. అదే విధంగా ప్రస్తుత తుపాను ప్రభావం అధికంగా ఉన్న సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏమైనా సమస్యలు ఏర్పడితే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

బొరుగుల బట్టీల పొగతో అవస్థలు



జమ్మలమడుగు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని కోవెలకుంట్ల రోడ్డులో నివాసాల మధ్య పొగధాటికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోవెలకుంట్ల రోడ్డులోని స్థానిక నివాసాలకు బొరుగుల బట్టీల నుంచి ఇటుకల ఫ్యాక్టరీల నుంచి పొగ వస్తుండడం వలన శ్వాసకోశ వ్యాధులతో అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. ప్రధాన రోడ్డు పక్కనే ఇండ్లచుట్టూ పొగ చుట్టుకున్నా సంబంధిత అధికారులు స్పందించడంలేదని వాపోయారు. ఈ పొగధాటికి కొందరు నివాసాల వారు ఇండ్లను ఖాళీ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బొరుగుల బట్టీల నుంచి పొగ రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ శివార్లలో బట్టీలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండాపురం తహసీల్దార్‌గా గురప్ప

కొండాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : కొండాపురం తహసీల్దార్‌గా సి.గురప్ప సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సింహాద్రిపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన ఇదే కార్యాలయంలో గతంలో డిప్యూటీ తహసీల్దార్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనకు రెవెన్యూ సిబ్బంది ఆయనను సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మీనా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎస్‌డబ్ల్యూవో గురుప్రసాద్ తెలిపారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామని తెలిపారు. టెట్ పాసైన అభ్యర్థులు 2.50 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారు శిక్షణకు అర్హులని, ఈనెల 21వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 27న స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించి అర్హులైన అభ్యర్థులకు మెరిట్ లిస్టు ప్రకారం డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ శిక్షణ పోస్టులకు శిక్షణ ఇస్తామని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బద్వేలు..: జిల్లా పరిధిలోని ఎస్సీఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ రామయ్య తెలిపారు. ఎస్సీఎస్టీ అభ్యర్థులకు ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. టెట్ అర్హత కలిగి ఉండి వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 21వతేదీలోపు జ్ఞానభూమివెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 27వ తేదీన టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అందుబాటులో యూరియా

ముద్దనూరు అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉన్నట్లు ఏవో వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధి యామవరం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఏవో మాట్లాడుతూ కోరమాండల్ గ్రాన్యూలర్ యూరియా యామవరం, ఉప్పలూరు,కోరమాండల్ డీఏపీ పెనికెలపాడు రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆధార్ కార్డులో రైతు సేవాకేంద్రాలకు వెళ్లి తీసుకోవచ్చన్నారు.

'బెల్టుషాపు నిర్వహిస్తే సహించం'

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారి మఠంలో బెల్టుషాపులు నిర్వహిస్తే సహించబోమని సీపీఎం జిల్లాకార్యదర్శి సభ్యుడు శివ కుమార్ తెలిపారు. సోమవారం మఠం మండలంలోని సుందరయ్య భవన్‌లో వారు మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం నిషేధించాల్సిన ప్రభుత్వాలు మద్యం ఆదాయంతో ప్రభుత్వం నడవాల్సిన పరిస్థితికి రావడం బాధాకర విషయం అన్నారు. ఈ సమావేశంలో గోవిందుస్వామి, సునీల్, రాహుల్, భాస్కర్, ప్రదీప్ పాల్గొన్నారు.